క్లుప్తంగా

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు


తిరుమల: శ్రీవారిని సోమవారం తిరుపతి ఎంపీ గురుమూర్తి, పాండిచ్చేరి మంత్రి చంద్ర ప్రియాంక, వెస్ట్రన్ కమాండర్ చీఫ్ నౌకా కేంద్రం కందుకూరి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, బీజేపీ ఎంపీ సీఎం రమేష్ దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు


పూజలను చేస్తున్న కాలనీ వాసులు

చంద్రగిరి: మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీ శ్రీలక్ష్మీనగర్(ఎస్ఎల్ నగర్) లేఅవుట్‌లో సోమవారం కాలనీ వాసులు వినాయక స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులు మాట్లాడుతూ లేఅవుట్ ఏర్పడినప్పటి నుంచి ఆలయం లేకపోవడంతో స్వామివారి విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలోనే ఆలయ నిర్మాణం చేపడతామన్నారు. వెంకట్ రెడ్డి, శివకుమార్ శర్మ, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం వితరణ



తిరుపతి కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి స్మార్ట్ సిటీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వద్ద సుమారు 450 మందికి పేదలకు అల్పాహారం వితరణ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ కోశాధికారి వనాద్రి మాట్లాడుతూ వాణి మెడికల్స్ అధినేత పార్థసారథి, నిషిక సహకారంతో పేదలకు అల్పాహారం అందజేయడం అభినందనీయమన్నారు. ఆకలిగా ఉన్నవారికి ఒక పూట అన్నం పెట్టడం ఎంతో తృప్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి స్మార్ట్ సిటీ ప్రతినిధులు బాబు నాయుడు, శ్రీహరి, మోహన్, చక్రి, శీను, సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న హరిప్రసాద్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ పరిపాలనా భవనం వద్ద వైఎస్సార్‌సీపీ రాయలసీమ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆ విద్యార్థి విభాగం అధ్యక్షుడు వి.హరిప్రసాద్‌రెడ్డి, వర్సిటీ విద్యార్థి సంఘం నేత సదా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎండల నేపథ్యంలో వాహనదారులు, విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుచేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపి విద్యార్థి విభాగం నాయకులు, వర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

రామచంద్రాపురం: మండలంలోని సీరామాపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ 100 రోజుల పని పూర్తి చేయించాలని చెప్పారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.257 కూలి గిట్టుబాటు అయ్యేలా కొలతలు ఇవ్వాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. పని ప్రదేశంలో ప్రతిరోజూ ఫొటోలు తీసి ఎన్ఎంఎస్ఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ హంసవేణి, జూనియర్ ఇంజినీర్ మమత, టెక్నికల్ అసిస్టెంట్లు సుదర్శన్, రమేష్ పాల్గొన్నారు.

రేషన్ కోసం రాస్తారోకో

ఏర్పేడు: అధికారుల నిర్లక్ష్యంతో 3 నెలలుగా రేషన్ బియ్యం అందకపోవడంతో గ్రామస్తులు, మహిళ లు రాస్తారోకో చేసిన ఘటన సోమవారం మండలంలోని కృష్ణంపల్లె వద్ద చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం..మండలంలోని పాగాలి పంచాయతీ కృష్ణంపల్లె, ఎస్సీ కాలనీలు ఉన్నాయి. వీటిలో 170 రేషన్ కార్డులు ఉన్నాయి. గతంలో ప్రతి నెలా క్రమం తప్పకుండా రేషన్ బియ్యం అందేది. అయి తే మూడు నెలలుగా రేషన్ బియ్యం అందకపోవడంతో పలుసార్లు రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి అధికారులకు సమస్యను నివేదించినా పట్టించుకోపోవడంతో గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున ఏర్పేడు–వెంకటగిరి ఆర్అండ్‌బీ రోడ్డుపై ఆందోళనకు దిగారు. రాస్తారోకోతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో సైతం గత జనవరిలో కలెక్టర్‌కు అర్జీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న తహసీల్దారు ఉదయ్ సంతోష్ సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. అప్పటికప్పుడే వాహనం ద్వారా రేషన్ బియ్యాన్ని తెప్పించి గ్రామస్తులకు పంపిణీ చేశారు.

2024 తర్వాత టీడీపీ భూస్థాపితం

- ప్రజల శంఖారావంలో చంద్రబాబు గుండె బద్దలు
- ప్రజారంజక పాలన అందిస్తున్న జగనన్న
- జగనన్నే మా భవిష్యత్తులో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి


ప్రభుత్వ పథకాలపై ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన, కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవళికారెడ్డి

తిరుపతి మంగళం : రానున్న 2024 ఎన్నికల తర్వాత రాష్ట్రంలో టీడీపీ భూస్థాపితం అవుతుందని, చంద్రబాబుకు రాజకీయ సన్యాసం తప్పదని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి జోస్యం చెప్పారు. ఆయన సోమవారం తిరుపతిలోని 10, 11వ డివిజన్లలో కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవళికారెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల గురించి ఆరా తీశారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగించాలా? వద్దా? అని ప్రశ్నించారు. మీకిష్టమైతే జగనన్న స్టిక్కర్‌ను ఇంటికి అంటించుకోవాలని కోరారు. దాంతో స్థానికులు జగనన్నను మా గుండెల్లోనే పెట్టుకుంటామని సంతోషంగా చెప్పారు. అనంతరం జగనన్న టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయించారు. ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ జగనన్న పాలనలో 87 శాతం మందికి పైగా లబ్ధిపొందిన పేదలు పూరించనున్న ఎన్నికల శంఖారావంలో చంద్రబాబు గుండె బద్దలవుతుందన్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన 75 ఏళ్లల్లో ఏ రాజకీయ నాయకుడూ అందించలేనని పథకాలను నాలుగేళ్లల్లో అందించిన గొప్ప నాయకుడు జగనన్న అని గర్వంగా చెప్పారు. జగనన్న సంక్షేమ పథకాలతో లబ్ధిపొందని ఇళ్లేలేదన్నారు. అందుకే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ప్రజల ఇళ్ల వద్దకు వెళుతుంటే ఎంతో ఆదరణ లభిస్తోందన్నారు.

27వ డివిజన్‌లో మేయర్ శిరీష పర్యటన

తిరుపతి 27వ డివిజన్‌లోని తాతయ్యగుంట కట్టపై సోమవారం మేయర్ శిరీష జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, జేసీఎస్ అధ్యక్షులు దొడ్డారెడ్డి మురళీరెడ్డి, డివిజన్ అధ్యక్షులు రూపేష్‌రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, వెంకటేష్‌రాయల్, రామకృష్ణారెడ్డి, జితేంద్రబాబు, సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

మంగళంలో జగనన్నే మా భవిష్యత్తు

తిరుపతి మంగళం : జగనన్న అధికారంలోకి వచ్చాకే మా జీవితాలకు భరోసా లభించిందని, జగనన్నే మా భవిష్యత్తు అని మంగళంలోని సప్తగిరినగర్, రణధీర్‌పురం పంచాయతీ ప్రజలు తెలిపారు. సర్పంచులు నాగభూషణమ్మ, లీలావతి, ఉపసర్పంచ్ అశోక్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పంచాయతీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న చేసిన మంచిని ప్రజలకు వివరిస్తూ వారి అనుమతితో ఇంటికి స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఉమాపతి, పార్టీ నాయకులు మహ్మద్ ఖాసీమ్, భాస్కర్‌రెడ్డి, మురగ, దీపశ్రీ, సతీష్, మురళి పాల్గొన్నారు.

ప్రతి గడపకూ మా నమ్మకం నువ్వే జగన్

భాకరాపేట: మా నమ్మకం నువ్వే జగన్ అని ప్రతి ఒక్కరూ అంటున్నారని చిన్నగొట్టిగల్లు జెడ్పీటీసీ స్వరూప అన్నారు. ఆమె సోమవారం చట్టేవారిపాలెం పంచాయతీ ఎలిచెర్ల (హరిజనవాడ) గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించారు. కార్యక్రమంలో మహేంద్ర రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఖదీర్ అహమ్మద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండారెడ్డి, చట్టేవారిపాలెం డివిజన్ అధ్యక్షుడు ఉమా మహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచిని గుర్తించండి..జగనన్నను ఆశీర్వదించండి

తిరుపతి రూరల్: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రమిస్తున్నారని, ఆయన చేస్తున్న మంచిని గుర్తించి వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి కోరారు. ఆయన సోమవారం సీగొల్లపల్లిలో జగనన్నే మా భవిష్యత్తు– నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలన, నవరత్నాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. తనను నమ్ముకున్న ప్రజలకు మేలు చేయాలన్నదే జగన్ సంకల్పమన్నారు. జగనన్న బాటలోనే నడుస్తూ ఎ మ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రూ.430 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. సర్పంచ్ విడుదల రవి, జేసీఎస్ నేతలు పాల్గొన్నారు.

సంక్షేమ రథసారథి వైఎస్ జగన్

చంద్రగిరి: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అర్హులందరికీ పథకాలు అందిస్తూ సంక్షేమ రథసారథిగా ప్రజల్లో గుండెల్లో నిలిచిపోయారని చెవిరెడ్డి హర్షిత్ తెలిపారు. వెంకటంపేటలో సోమవారం సర్పంచ్ వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ఫలాలపై ఆరా తీశారు. వారి అనుమతితో జగనన్న స్టిక్కర్లను అంటించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి పలు వినూత్న పథకాలను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. ప్రతి నెలా 1వ తేదీనే అవ్వాతాలకు పింఛను అందజేస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. నాడు–నేడు కింద ఆస్పత్రులు, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారని కొనియాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీ అఖండ విజయాన్ని స్వంతం చేసుకోవడం ఖాయమని జోస్యం చెప్పారు. జగనన్న నాయకత్వంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి చంద్రగిరిని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. సుమారు రూ.430 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఉపసర్పంచ్ సతీష్, ఆనందయ్య, హరి, వాసు, నాగార్జున, మోహనయ్య తదితరులు పాల్గొన్నారు.

కుప్పంబాదూరులో..

రామచంద్రాపురం: మండలంలోని కుప్పంబాదూరు గ్రామంలో సోమవారం ఎంపీటీసీ కృష్ణవేణమ్మ, కుప్పంబాదూరు పీహెచ్‌సీ చైర్మన్ రామచంద్రారెడ్డి, డివిజన్ అధ్యక్షులు చిట్టిబాబు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. వారు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లను అంటించారు.


తిరుపతి 27వ డివిజన్‌లో ప్రజలతో మాట్లాడుతున్న మేయర్ శిరీష


చట్టేవారిపాళెం పంచాయతీలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు


సీగొల్లపల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి


ఇంటికి జగనన్న స్టిక్కర్లను అంటిస్తున్న చెవిరెడ్డి హర్షిత్, పార్టీ నాయకులు


జగనన్నే మా భవిష్యత్తు కరపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ కృష్ణవేణమ్మ


మంగళంలో ప్రజలతో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ, అశోక్‌రెడ్డి

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

చంద్రగిరి: మండలంలోని రాయలపురం పంచాయతీ వెంకటంపేటలోని ప్రభుత్వ పాఠశాలలోని ఎన్ఆర్ఎస్‌టీ సెంటర్‌లో చదువుతున్న వలస కార్మికుల పిల్లలకు సోమవారం యూనిఫాంను పంపిణీ చేశారు. ఇందులో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చెవిరెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్ పాల్గొని 30 మంది పిల్లలకు యూనిఫాం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి ప్రభుత్వ పాఠశాల పిల్లలకు తన స్వంత నిధులతో యూనిఫాంను అందజేయడం అభినందనీయమన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ వలస కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సెంటర్‌ను ఏర్పాటు చేసి, విద్యాబుద్ధులు నేర్పిస్తున్నట్టు తెలిపారు. వారికి యూనిఫాం పంపిణీ చేశామని, మధ్యాహ్న భోజనానికి తన వంతుగా రూ.10 వేలు అందజేయనున్నట్టు తెలిపారు. అనంతరం చెవిరెడ్డి హర్షిత్, ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డిని ఎంఈఓ లలిత కుమారి సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటయ్య, పార్టీ డివిజన్ అధ్యక్షుడు దేవారెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, మట్ట మధు, ఆనందయ్య, హరి పాల్గొన్నారు.


విద్యార్థులతో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి తదితరులు

14న ప్రత్యేక కార్యక్రమాలు

తిరుపతి అర్బన్: ఈనెల 14వ తేదీన బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్టు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. అధికారులు, అనధికారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నేతలు, సేవా సంస్థల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కమిషనర్‌కు వీఆర్వోల శుభాకాంక్షలు


కమిషనర్‌ను సన్మానిస్తున్న వీఆర్వోల సంఘం నేతలు

తిరుపతి తుడా: తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ హరితకు తిరుపతి డివిజన్ వీఆర్వోల సంఘం అధ్యక్షుడు చెంగల్‌రాయలు నేతృత్వంలో శుభాకాంక్షలు తెలిపారు. వారు సోమవారం తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో ఆమెను శాలువాతో సత్కరించారు. వీఆర్వోల సంఘం నేతలు మురళి, గుణశేఖర్, రాజశేఖర్, సుముదా పాల్గొన్నారు.

క్యాన్సర్‌తో అప్రమత్తంగా ఉండాలి

భాకరాపేట: క్యాన్సర్‌తో అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. స్విమ్స్ ఆధ్వర్యంలో సోమవారం ఎర్రావారిపాలెం మండలం బోడేవాండ్లపల్లిలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. దీన్ని మోహిత్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ పింక్ బస్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ మాట్లాడుతూ మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆదేశాల మేరకు పింక్ బస్ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. బోడేవాండ్లపల్లి గ్రామ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో స్విమ్స్ వైద్యులు, నెరబైలు పీహెచ్‌సీ డాక్టర్ కృష్ణ చైతన్య, బోడేవాండ్లపల్లి, ఎర్రావారిపాలెం నాయకులు చెంగల్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, శివకుమార్, మనోహర్ రెడ్డి, నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

మురుగుపై నిర్లక్ష్యమెందుకో?

తిరుపతి తుడా : ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో నిత్యం యాత్రికులతో రద్దీగా వుండే తిరుమల బైపాస్ రోడ్డులో గడిచిన 20 రోజులుగా మ్యాన్‌హోల్ ఓవర్‌ఫ్లో అవుతూనే ఉంది. దీంతో ఆ ప్రాంతం మురుగుమయంగా మారింది. ప్రకాశం పార్కు సమీపంలో ఎదురవుతున్న సమస్య ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. పాదచారులు మురుగు నీటిలోనే నడవాల్సి వస్తోంది. వాహనదారులు వేగంగా వెళ్లే సమయంలో మురుగు నీరు నడుచుకుంటూ వెళ్లే వారిపై పడుతోంది. మ్యాన్‌హోల్ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందుతున్న తిరుపతిలో రోజుల తరబడి రోడ్లపై మురుగు నీరు పారుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.



అభివృద్ధి అజెండాగా నేడు కౌన్సిల్ సమావేశం

తిరుపతి తుడా: తిరుపతి నగర అభివృద్ధే లక్ష్యంగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారం ఎస్వీయూ సెనేట్ హాల్లో నిర్వహించనున్నారు. ఇందులో ఎమ్మెల్యే భూమన ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొంటారు. కమిషనర్ హరిత అజెండాను ప్రవేశపెట్టనున్నారు. మొత్తం 104 అంశాలపై అజెండా రూపొందించినట్టు సమాచారం. ప్రధానంగా 50 వార్డుల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. సుమారు రూ.30 కోట్ల మంజూరుకు కౌన్సిల్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది.

నేడు మహతిలో జ్యోతిరావ్ పూలే జయంతి ఉత్సవం

తిరుపతి అర్బన్: మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా స్థానిక బాలాజీ కాలనీలోని జ్యోతిరావ్‌పూలే విగ్రహానికి మంగళవారం ఉదయం 9.30 గంటలకు పూలమాల వేసి నివాళులర్పిస్తామని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

తిరుపతి కల్చరల్: టీటీడీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మహతి కళాక్షేత్రంలో మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి ఉత్సవం నిర్వహించనున్నారు. అలాగే బాలాజీ కాలనీలోని జ్యోతిరావ్ పూలే విగ్రహం వద్ద మంగళవారం ఉదయం 8.30 గంటలకు మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలు నిర్వహించనున్నట్టు బీసీ సంఘర్షణ సమితి నేతలు తెలిపారు.

రైతన్నలకు అన్నం పెట్టడం దేవుడిచ్చిన వరం


రైతులకు అన్నం పెడుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

- సంతల్లో రైతులకు భోజనాలు
- ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

పాకాల : ప్రజలకు అన్నం పెట్టే రైతన్నలకు భోజనం పెట్టడం దేవుడు నాకిచ్చిన వరమని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం పాకాలలోని ఆర్టీసీ బస్‌స్టాండ్‌కు సమీపంలో జరుగుతున్న వారపు సంతలో ఎమ్మెల్యే సొంత నిధులతో ఉచితంగా భోజనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి కూరగాయలను పండించి అమ్ముకోవడానికి సంతలకు వస్తారని తెలిపారు. ఆ సమయంలో వారు అన్నం తినడానికి కూడా సమయం ఉండదని, ఒక్కోసారి పస్తులు ఉంటున్నారని తెలిపారు. పంటలకు సరైన గిట్టుబాటు ధర లేకపోతే కూరగాయలు అమ్మిన డబ్బు అవసరాలకు సరిపోదని భావించి నీరు తాగి ఇంటికి వెళ్లిన రైతులను చూశానని ఆవేదన చెందారు. రైతులకు అన్నం పెట్టి ఆకలి తీర్చాలన్న ఆలోచనతో అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో అన్ని వారపు సంతల్లో రైతులు, వ్యాపారులు భోజనం చేయవచ్చని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు భోజనాలను సరఫరా చేశారు. రుచికరమైన 12 రకాల భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్.జయదేవ్‌నాయుడు, ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, నంగా బాబురెడ్డి, వల్లివేడు విక్రమ్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం కస్తూరి, మునీశ్వర్‌రెడ్డి, లింగయ్యనాయుడు, రఘుపతి, హరిరెడ్డి, వినాయక, హరిప్రసాద్‌రెడ్డి, కళావతి, మునీర్, రమేష్, సురేష్, విశ్వనాథరెడ్డి తదతరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాష్ట్రానికి మంచి పేరు తీసుకురండి


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం/తిరుపతి అర్బన్ : క్రీడల్లో రాణించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కరాటే క్రీడాకారులకు సూచించారు. గోవాలోని మనోహర్ పారికర్ ఇండోర్ స్టేడియంలో మార్చిలో జరిగిన ఏషియన్ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సత్యవేడుకు చెందిన ఎఫ్ఎస్ఎస్‌కేఐ కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారు. కటాస్, కుమితే (అండర్ 12, అండర్ 13, అండర్ 14) విభాగాల్లో 8 మంది విద్యార్థులు 10 బంగారు పతకాలు, 6 వెండి పతకాలు సాధించినట్టు కరాటే మాస్టర్ కన్నయ్య తెలిపారు. విద్యార్థులను సోమవా రం తిరుపతి ఎంపీ గురుమూర్తి అభినందించారు. నిరుపేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి ప్రతిభను వెలికితీస్తున్న కరాటే మాస్టర్ కన్నయ్యను సత్కరించారు. అదేవిధంగా విద్యార్థులు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డిని కలిశారు. వారిని కలెక్టర్ అభినందించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు.

ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు

- సకాలంలో పరిష్కరించాలి
- మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత


ప్రజాఫిర్యాదులపై సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా : ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించవద్దని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత అధికారులను ఆదేశించారు. ఆమె సోమవారం స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలను నిర్వహించారు. డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్, ముద్రనారాయణతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మంచినీళ్ల గుంటలో మురుగు నీరు కలవకుండా చర్యలు తీసుకుని సంరక్షించాలని కార్పొరేటర్ నరసింహా చారి విన్నవించారు. అలానే కేటీరోడ్డు యశోదానగర్‌లో ప్రవహించే మాల్వాడిగుండ కాలువలో చెత్త, పూడిక తొలగించాలని స్థానికులు కోరారు. అదే ప్రాంతంలో యూడీఎస్ కనెక్షన్లు తీసుకోకుండా సెప్టిక్ వాటర్‌ను కాలువల్లో వదలడం వల్ల దుర్గంధం వెదజల్లుతోందన్నారు. గిరిపురంలో ఎవరికివారు ఇష్టారాజ్యంగా స్పీడ్ బ్రేకర్లను వేసుకోవడం వల్ల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. స్పందన అనంతరం కమిషనర్ అధికారు లతో సమీక్షించారు. ప్రతి ఫిర్యాదుకూ పరిష్కారం చూపాలని ఆదేశించారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళేశ్వరరెడ్డి, ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, డీసీపీ దేవికుమారి, రెవెన్యూ ఆఫీసర్ కేఎల్ వర్మ, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనసూయమ్మకు ఎమ్మెల్యే భూమన నివాళి

తిరుపతి మంగళం : తిరుపతి 23వ డివిజన్ కార్పొరేటర్, ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి వ్యక్తిగత కార్యదర్శి రామస్వామి వెంకటేశ్వర్లు మాతృమూర్తి అనసూయమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి సోమవారం రామస్వామి వెంకటేశ్వర్లు ఇంటికి చేరుకున్నారు. అనసూయమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భూమన, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

శంకర్‌రావు ఆరోపణలు అవాస్తవం

తిరుపతి కల్చరల్: ఎమ్మార్పీఎస్ సంఘం పేరుతో ఏఎస్.శంకర్‌రావు మరికొంత మంది చేస్తున్న ఆరోపణలు అవాస్తవాలని శ్రీసత్యసాయి యువజన సంఘం కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. శ్రీసత్యసాయి యువజన సంఘాన్ని 1997లో స్థాపించి అప్పటి నుంచి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆటోనగర్‌లో స్థలాన్ని తాము కబ్జా చేశామంటూ నిందారోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. కబ్జాకు గురైందని ఆరోపిస్తున్న స్థలంలో వంద అంకణాలను ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియా సర్వీసుకు తీసుకున్నారని తెలిపారు. మిగిలిన 42 అంకణాల స్థలంలో తమ సంఘం కార్యక్రమాలు జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ స్థలంలో తమకు భాగం కావాలని శంకర్‌రావు మరి కొంతమంది గొడవ చేస్తూ తనపై దాడికి దిగుతున్నారని తెలిపారు. తాము నిర్మించుకున్న కార్యాలయాన్ని ధ్వంసం చేశారని తెలిపారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు స్పందించి దౌర్జన్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.